క్లుప్తంగా

శివ్వంపేటలో నేడు హరీశ్‌రావు రోడ్ షో

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో ఇదివారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రోడ్ షో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాత్రి 8 గంటలకు శివ్వంపేటలో రోడ్ షో ఉంటుందని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలన్నారు.

ముదిరాజ్‌లకు సముచిత న్యాయం కల్పించాలి


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాసాయిపేట మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన అన్నిరంగాల్లో సముచిత న్యాయం కల్పించాలని అన్నారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్షయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు భీమరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మహిళా జిల్లా అధ్యక్షురాలు అరుణ, మహిళా ప్రధాన కార్యదర్శి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి


ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

శివ్వంపేట(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు ఓటర్ స్లిప్పులు మే 6 వరకు పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం పలు గ్రామాల్లో ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓకు పలు సూచనలు చేశారు. మే 13న జరుగు పోలింగ్ రోజున కేంద్రానికి ఓటరుకు సంబంధించి 13 రకాల ఏదైన గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

గౌతోజీగూడెంలో ఉచిత హెల్త్ క్యాంప్


పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో సీఎంఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు, మందులను అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్య చికిత్సలు సైతం చేయిస్తామన్నారు. అనంతరం సీఎంఆర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి జెఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ శోభారాణి, సీఎంఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారి నిఖిల, సతీష్, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి


మాట్లాడుతున్న మాల మహానాడు నాయకుడు సంజీవ్

పాపన్నపేట(మెదక్): రాజ్యాంగం మార్చే బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్ పిలుపు నిచ్చారు. శనివారం ఆయన పాపన్నపేటలో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత రాజ్యాంగానికి ప్రత్యేక విలువ ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించడం ఆందోళనకు తావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు శివ, దాడిగ నరేష్, యాదగిరి, కుమార్, ఆనంద్, ఇమాన్యియల్, లింగం, అనిల్ కుమార్, నారాయణ, లక్ష్మణ్, శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ఆర్డీఓ, నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్: వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీఓ, నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి శనివారం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 104 మంది వృద్ధులు, 156 మంది దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు దరఖాస్తు చేశారని తెలిపారు. కాగా నియోజకవర్గంలో 12 రూట్లుగా విభజించి 260 మందితో వచ్చే నెల 3న ఇంటి వద్ద ఓటు వేయించేందుకు ఎన్నికల పీఓలు, ఏపీఓలు వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓటు వేయిస్తారన్నారు. ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన వారందరికీ మే 3న ఎన్నికల సిబ్బంది వస్తారని అందుబాటులో ఉండాలనే సమాచారం ఇచ్చామన్నారు. ఒకవేళ వారు 3న అందుబాటులో లేకపోతే మరునాడు ఎన్నికల అధికారులు వారి ఇంటికి వెళ్తారని రెండో రోజు సైతం అందుబాటులో లేకపోతే ఆ తర్వాత ఓటు వేసే అవకాశం ఉండదని వివరించారు.

రెండు రోజులే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా మే 3న ఇంటి వద్ద ఉండాలని వృద్ధులను, దివ్యాంగులను కోరారు. ఇదిలాఉండగా మే 3, 4 తేదీల్లో నియోజకవర్గంలోని పీఓలు, ఏపీఓలకు శిక్షణ తరగతులు ఉంటాయని జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని చెప్పారు. శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారిపై ఎన్నికల నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా మే 6న అదర్ పోలింగ్ ఆఫీసర్లకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శిక్షణ ఉంటుందని వివరించారు.

తుది ఓటరు జాబితా సిద్ధం

నియోజకవర్గంలో తుది ఓటర్ల జాబిత వచ్చిందని ఆర్డీఓ, నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో రెండు లక్షల 27వేల 126మంది ఓటర్లు ఉన్నారని, ఈమేరకు తుది జాబితా వచ్చిందని చెప్పారు. వారిలో ఒకలక్ష పదివేల 184 మంది పురుషులు, ఒకలక్ష 16వేల 898 మంది మహిళ ఓటర్లు, ఇతరులు ఆరుగురు ఉండగా 38 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని వివరించారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్యాక్స్ సీఈఓ వెంకటస్వామిగౌడ్, ఐకేపీ ఏపీఓ గౌరీశంకర్‌లకు సూచించినట్లు ఆర్డీఓ అన్నారు. శనివారం ఉదయం వారిద్దరిని తన కార్యాలయానికి పిలిపించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేసినట్లు చెప్పారు. కేంద్రాలకు వచ్చిన వడ్లు ఎండగానే తూకం వేయాలని జాప్యం చేయొద్దని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని వారికి సూచించామన్నారు. కాగా అంతటా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా కొనసాగుతున్నాయని జగదీశ్వర్‌రెడ్డి వివరించారు. సమావేశంలో మండల తహసీల్దార్ కమలాద్రి తదితరులు ఉన్నారు.

వైభవంగా బేతాళ స్వామికి బోనాలు


బోనాలు ఊరేగింపులో భక్తులు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం భక్తులు బేతాళ స్వామికి గండజ్యోతి నెత్తిపై ఎత్తుకొని, ఆలయం చుట్టు ప్రదీక్షణలు చేశారు. అలాగే బోనాలను భక్తి శ్రద్ధలతో ఉరేగించి బేతాళ స్వామికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుక తిలకించేందుకు చుట్టు పక్క గ్రామాల ప్రజలతో పాటు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉత్సవాల్లో ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు


ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల సహకార అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహాయంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత మాటలు


కాడిపల్లి రోడ్‌షోలో పాల్గొన్న జనం


కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో ప్రచారంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు

కొల్చారం(నర్సాపూర్): ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, మరోసారి మోసపూరిత మాటలతో ఓట్లు అడుగుతుందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రఘునందన్ రావు మండలంలోని దుంపలకుంట చౌరస్తా నుంచి రంగంపేట, సంగాయిపేట, చిన్నఘనాపూర్, పోతంశెట్టిపల్లి చౌరస్తా, రాంపూర్, కిష్టాపూర్, వరిగుంట, కొల్చారం వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో రోడ్ షో నిర్వహించారు. రంగంపేటలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రజలందరూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పదేళ్ల పాలల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అవినీతికి అడ్డగా మార్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయరన్న భయంతో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని దేవుళ్లపై ఒట్టు వేస్తుండడం హాస్యస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మురళీధర్ యాదవ్, మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్, జిల్లా కార్యదర్శి యాదగిరి, నాయకులు రాజేందర్ గౌడ్,సురేష్, హరీశ్, గిరి, పోచయ్య, సాయి, వెంకటేశం, దుర్గయ్య పాల్గొన్నారు.

దేశరక్షణ బీజేపీతోనే సాధ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): దేశరక్షణ అనేది బీజేపీతోనే సాధ్యమవుతుందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. మండలంలో రఘునందన్‌రావు, బీజేపీ నాయకులతో కలసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకున్నాక కేసీఆర్ పదేళ్లు మాయమాటలతో ప్రజలను ఏమార్చి ప్రభుత్వం నడిపించారన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌తో లాభం లేదని, రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే ఆయన చేసిందేమీ లేదన్నారు. చిలప్‌చెడ్ మండలంగా ఏర్పాటై ఏడేళ్లు గడుస్తున్నా.. కనీసం ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. రేవంత్‌రెడ్డి ఐదు నెలలుగా రుణమాఫీ చేయలేదన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకున్నది మోదీయేనని, మూడేళ్లుగా ప్రజలకు ఉచిత రేషన్ ఇస్తున్నది, మరో ఐదేళ్లు ఉచిత రేషన్ బియ్యం ఇచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మురళీయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వెంకటరమణ, నాగేష్‌యాదవ్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

మీపిల్లలు, దేశభవిష్యత్ కోసం బీజేపీని గెలిపించండి

కాడిపల్లి(నర్సాపూర్): మీ పిల్లలు, దేశభవిష్యత్ కోసం బీజేపీని గెలిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు తెలిపారు. శనివారం రాత్రి కాడిపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎంపీ ఎన్నికలతో కేసీఆర్ సీఎం అయ్యేది లేదు.. రేవంత్‌రెడ్డి సీఎం నుంచి దిగేదిలేదని బీజేపీకి ఓటువేసి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్‌తో ఒరిగేది ఏమిలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రెండేళ్లుగా ఎమ్మెల్సీగా ఉండి ఏం చేయలేదని, ఇప్పుడు రూ. 100కోట్లతో విద్యార్థులను అభివృద్ధి చేస్తానని చెప్పడం మోసం చేయడమనేనని చెప్పారు. బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మురళీధర్‌యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండలాధ్యక్షుడు రాకేష్, నాయకులు రామనారావ్, రాజేందర్, నాగయ్య, శేఖులు, కచీష్ణ, శాఖయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

నర్సాపూర్: పట్టణంలోని ప్రభుత్వ మైనారిటీ బాలుర గురుకుల కాలేజీలో ఇంటర్మీడియెట్ నందు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జెంలానాయక్ అభినందించారు. కాలేజీకి చెందిన బాలకృష్ణ, అక్బర్ అలీ, మోహన్‌యాదవ్, మంచి ఫలితాలు సాధించగా వారిని శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ.పాటిల్ సమక్షంలో పెద్దశంకరంపేట మండలంలోని కమలాపూర్, చీలాపల్లి తదితర గ్రామాలకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. శనివారం టేక్మాల్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి దేశప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. బీజేపీకి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, శ్రావణ్, శ్రీశైలం, గంగారెడ్డి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం చదవాలి

నర్సాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని దానిని చేరేందుకు చదవాలని సిప్ర ల్యాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ హితవు పలికారు. శనివారం రాత్రి విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి కాలేజీ(వైపర్)లో కాలేజీ 17వ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫార్మసీ రంగానికి మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో మైసూరు సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్టు డాక్టర్ గిరిధర్ పర్వతం, విష్ణు ఎడ్యుకేషన్ సొసైటి వైస్ చైర్మన్ రవిచంద్రన్, కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయిస్తా: నీలం మధు

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే చేగుంటకు డిగ్రీ కళాశాలను మంజూరు చేయిస్తానని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు అన్నారు. చేగుంటలో శనివారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో నీలం మధు మాట్లాడారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు నవీన్, ఎంపీపీ శ్రీనివాస్, వెంగళ్‌రావు, శ్రీకాంత్, రాంపూర్ భాస్కర్, ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అడవిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నర్సాపూర్: నర్సాపూర్ అడవిలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం దొరికిందని ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. పట్టణ శివారులోని అర్బన్ పార్కుకు ఎదురుగా ఉన్న అడవిలో పూర్తిగా కుళ్లి పోయిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని చూసి అటవి శాఖ సిబ్బంది తమకు సమాచారం ఇచ్చారని చెప్పారు. తాము వెళ్లి శవానికి పరీక్షలు నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. తమకు అందిన సమాచారం మేరకు తమ దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వివరించారు.

నీలం మధును గెలిపించండి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట(మెదక్): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును అధిక మెజార్టీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. చల్మెడ గ్రామానికి చెందిన చెప్పెట ముత్యంరెడ్డి సమక్షంలో మండలానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సంరర్భంగా శనివారం ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గెలిచిన 3 నెలల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరవడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. వచ్చిన 3 నెలల్లో గ్రామాల్లో సీసీ రోడ్లు వేసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, సీనియర్ నాయకుడు ముత్యంరెడ్డి, చల్మెడ, నందిగామ తాజా మాజీ సర్పంచ్‌లు నర్సింహరెడ్డి. ప్రీతి, అబ్బారెడ్డి, కరుణాకర్, తుమ్మల రమేశ్, కాకి రాజయ్య, లింగం గౌడ్, ఆకుల బాలయ్య. నసీరొద్దీన్, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో గుడిసె దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న పూరిగుడిసె


ప్రమాదంతో కట్టుబట్టలతో మిగిలిన దంపతులు

వెల్దుర్తి(తూప్రాన్): అనుమానాస్పదస్థితిలో నివాస పూరిగుడెసె దగ్ధమైన ఘటన మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోడ నీలమ్మ, సత్తయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. కుమారులిద్దరు గ్రామంలోనే వేరేచోట నివాసం ఉంటుండగా దంపతులిద్దరూ గుడిసెలో ఉంటున్నారు. అనారోగ్యానికి గురైన పెద్ద కుమారుడు బాలయ్య వద్దకు శుక్రవారం రాత్రి దంపతులిద్దరు వెళ్లగా శనివారం వేకువజామున సత్తయ్య నివాస గుడిసెకు అనుమానాస్పదస్థితిలో మంటలు చెలరేగాయి. ఎగిసిపడిన మంటలను ఆర్పేందుకు కుటుంబసభ్యులు, చుట్టు పక్కల వారు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రమాదంలో నిత్యావసర సరుకులతో పాటు వ్యవసాయ పట్టా పాస్‌బుక్‌లు, విలువైన డాక్యుమెంట్‌లు బంగారు, వెండి నగలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఘటనపై విచారించి తమను ఆదుకోవాలని బాధితులు జిల్లా అధికారులను కోరారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం


తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ(తెలంగాణ రాష్ట్ర సమితి) ఆవిర్భావం వేడుకల్లో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహాన్నికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌రంజన్‌గౌడ్, కిష్టారెడ్డి, వీరేష్‌గౌడ్, నందుగౌడ్, రమేష్, ప్రేమ్, నరేష్‌గౌడ్, మధుగౌడ్, భిక్షపతి, రవి, శ్రీను మురళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయండి

మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ


కోనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

రామాయంపేట(మెదక్): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని కోనాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని ఏరోజుకారోజు లారీల్లో రైసుమిల్లులకు తరించాలని సూచించారు. కోనాపూర్ కేంద్రంలో ఇప్పటివరకు ఆరువేల క్వింటాళ్లమేర వరి ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఆలస్యం చేయొద్దని సూచించారు. ఆయన వెంట కోనాపూర్ సహకార సంఘం సీఈఓ మల్లారెడ్డి, రైతులు ఉన్నారు.

వస్తువులను ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలి


నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాల్‌లో వస్తువులు పరిశీలిస్తున్న ఆర్ఎం, అధికారులు

నర్సాపూర్: బస్టాండ్‌లోని అన్ని దుకాణాల్లో నిర్ణీత ధరలకే వస్తువులు అమ్మాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ప్రభులత సూచించారు. ఆమె శనివారం బస్టాండ్‌లోని స్టాల్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటిలో ఉన్న వస్తువులు పరిశీలించడంతో పాటు వస్తువులపై ఉండే ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా రీజనల్ మేనేజర్ ప్రభులత ఆర్టీసీ డిపోను, పెట్రోలు బంకును ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటి నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అవసరమైన మార్గాల్లో అదనపు బస్సులు నడపాలని ఆర్ఎం ఆదేశించారు. ఆమె వెంట డిపో ఇన్‌చార్జి మేనేజర్ సుధా, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, ట్రాఫిక్ ఇన్‌చార్జి లక్ష్మణ్‌లతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.

గృహహింస, వరకట్న వేధింపులపై అవగాహన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సఖి సిబ్బంది

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో శనివారం సఖి సిబ్బంది ఉపాధి కూలీలకు గృహహింస, వరకట్న వేధింపులు, స్త్రీలపై దాడులు, అత్యాచారాలు, ఇతర దురాచారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి సిబ్బంది మాట్లాడుతూ.. ఆపత్కర పరిస్థితులు ఎదురైనపుడు వెంటనే 1098 లేదా 181 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందజేయాలని సూచించారు. ఆపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే 112, 181, 1098 లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందజేయాలని సఖి సిబ్బంది సూచించారు. ఏదైనా సంఘటనలో గాయాలపాలైన మహిళలను రెస్క్యూ వాహనంలో తరలించి వారికి తాత్కాలిక వసతి కల్పిస్తామని తెలిపారు. సఖి కేంద్రం కేస్ వర్కర్ కలావతి, పారా మెడికల్ వర్కర్ మంజుల, గ్రామ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమశాఖ, స్వార్డ్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో తాము గ్రామాల్లో మహిళలను చైతన్యపరుస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, సఖి ప్రతినిధులతో పాటు మహిళా శిశు సంక్షేమశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.